సాక్షి
సూర్యాపేట

శనివారం | 13 | ఏప్రిల్ | 2024



కులగణన తర్వాతే..
బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. - 10లో



'ఎమర్జెన్సీ' ఏర్పాట్లు
హైదరాబాద్‌కు తాగునీరందించేందుకు నాగార్జునసాగర్ వెనుక జలాల్లో ఎమర్జెన్సీ ఏర్పాట్లు చేస్తున్నారు. - 12లో



మహిళలకు స్వయం ఉపాధి
విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలు స్వయం ఉపాధి పొందొచ్చని ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్ అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నందున రైతులను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కల్పిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో వ్యాపారులు, మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను కోరారు. కొనుగోళ్ల విషయంలో ఎవరైనా రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మోసాలకు పాల్పడే వారిని నమ్మవద్దు, గుర్తింపు లేని వారికి ధాన్యం అమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని రైతులకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



టేకుమట్ల గ్రామం వద్ద రహదారిని పరిశీలిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట: జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని టేకుమట్ల నుంచి కోదాడ వరకు గల జాతీయ రహదారిపై తీసుకోవాల్సిన చర్యలను జీఎంఆర్ ప్రతినిధులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ఈ మధ్య కాలంలో అతివేగం, మద్యం సేవించి ప్రయాణించే క్రమంలో జరిగిన ప్రమాదాల్లో సుమారు పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారని తెలిపారు. అతివేగంతో రాత్రి పూట జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకుగాను రోడ్డుకు ఇరువైపులా ప్రయాణానికి అడ్డుగా ఉన్న ప్రకటన బోర్డులు, చెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సూర్యాపేట రూరల్ సీఐ వై.సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలు నాయక్, జీఎంఆర్ ప్రతినిధులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణను తలంబ్రాలతో కల్యాణతంతు గావించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. తర్వాత ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారిని ఊరేగిస్తున్న సమయంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు గావించారు.

హైవే.. రక్తసిక్తం

పది రోజుల వ్యవధిలోనే 12 మంది మృతి



గురువారం అర్ధరాత్రి సూర్యాపేటలో ప్రమాదానికి గురైన కారును తొలగిస్తున్న అధికారులు



సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో (ఫైల్)

ఒకే రోజు ఐదుగురు యువకులు దుర్మరణం

- 65వ నంబర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- అతివేగం.. అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లేనంటున్న పోలీసులు
- వరుస ప్రమాదాలతో ఆందోళన చెందుతున్న ప్రజలు



సూర్యాపేటలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: హైదరాబాద్ - విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి రక్తసిక్తంగా మారుతోంది. ఈ రహదారి నాలుగు లేన్లుగా ఉన్నప్పటికీ పెరిగిన వాహనాల రద్దీతో ఏదో ఒకచోట నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ రహదారిపై ఇటీవల సూర్యాపేట పట్టణ పరిధిలోని మానసనగర్, జాతీయ రహదారి ఫ్లైఓవర్, అంజనాపురి కాలనీ, రాయినిగూడెం శివారులో కేవలం పది రోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో 12 మంది మృతిచెందారు. వరుస ప్రమాద ఘటనలతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు ఇవీ..

- ఈనెల 4న జాతీయ రహదారిపై సూర్యాపేటలోని మానసనగర్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. మరో 11 మంది గాయపడగా నలుగురి పరిస్థితి విషమంగా ఉండడడంతో హైదరాబాద్ తరలించారు. వారిలో ఈ నెల 7న లావణ్య, 9న మోక్షిత్, 12న ఆటో డ్రైవర్ మహేష్ చికిత్స పొందుతూ మృతిచెందారు. గొలుసుల వేదశ్విని, మోక్షిత్‌లు ఇద్దరు అన్నాచెల్లెల్లు. తల్లి సంధ్య తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది.
- 8న సూర్యాపేట పట్టణంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న బైక్ మెకానిక్ సతీష్‌ను సూర్యాపేట - సిద్దిపేట రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి ఒంటిరిదైంది.
- 11న సూర్యాపేట నుంచి కేతేపల్లికి ఎర్టిగా కారులో వెళ్తున్న యువకులు అతివేగంతో కారును నడపడంతో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కేతేపల్లికి చెందిన జటంగి సాయి, అంతటి నవీన్ ఇద్దరు యువకులు మృతి చెందారు.

ఆటో ప్రమాదం మృతుల సంఖ్య ఆరుకు..



కంపసాటి మహేష్ (ఫైల్)

సూర్యాపేట, అర్వపల్లి: సూర్యాపేటలోని మానసనగర్ వద్ద 65వ జాతీయ రహదారిపై ఈ నెల 4న ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న కలకొట్ల లావణ్య, గొలుసు మోక్షిత్‌లు ఇటీవల మృతి చెందారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కంపసాటి మహేష్(27) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మహేష్‌కు 9నెలల క్రితమే వివాహమైంది.

అతివేగంతోనే ప్రమాదాలు



అతివేగం.. అజాగ్రత్తగా వాహనాలు నడపడంతోనే ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది. ఇటీవల హైవేపై జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువగా 20నుంచి 35 ఏళ్ల లోపువారు 150కిపైగా స్పీడ్‌తో కార్లను నడపడం వల్లే జరిగాయి. రహదారులపై వాహనాలు నడిపేవారు చాలా జాగ్రత్తగా నడపాలి. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలివ్వొద్దు.
– రాహుల్ హెగ్డే ఎస్పీ, సూర్యాపేట

- 11వ తేదీనే అర్ధరాత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేటకు చెందిన మహ్మద్ నవీద్, వెన్న నిఖిల్‌రెడ్డి, గుండగాని రాకేష్ అలియాస్ సన్నీలు మృతి చెందారు.

ముగిసిన అంత్యక్రియలు

గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుల అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకొని మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు.

మిన్నంటిన రోదనలు..

గురువారం అర్ధరాత్రి సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నిఖిల్‌రెడ్డి పట్టణంలోని కృష్ణా కాలనీకి చెందిన గోల్డ్ వ్యాపారి వెన్న సతీష్‌రెడ్డి-మాధవి దంపతుల చిన్న కుమారుడు. ఇతను తండ్రికి గోల్డ్ వ్యాపారంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. పొట్టి శ్రీరాములు సెంటర్‌కు చెందిన బ్యాటరీ మెకానిక్ మహ్మద్ జమీన్‌అలీ కుమారుడు నవీద్. ఇతను మొబైల్ షోరూంలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. నవీద్ పార్ట్‌టైం ఉద్యోగం చేసుకుంటూ న్యూజిలాండ్‌లో ఉన్నత విద్యనభ్యసించేందుకు పాస్‌పోర్ట్ రెడీ చేసుకున్నట్లు తండ్రి బోరున విలపిస్తూ తెలిపాడు. జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ సోమ నర్సయ్య కుమారుడు గుండగాని రాకేష్. ఇతను బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. తన కుమారుడు ఉద్యోగంలో చేరితే బాధలు తీరుతాయనుకుంటే లోకంలోనే లేకుండా వెళ్లి మాకు తీరని శోకాన్ని మిగిల్చావంటూ తండ్రి రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఇలా మూడు కుటుంబాల్లోనూ చేతికందిన కుమారుల మృతితో కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ముగ్గురు యువకుల మృతితో కృష్ణాకాలనీ, జాకీర్ హుస్సేన్ నగర్, పీఎస్సార్ సెంటర్ కాలనీల్లో విషాదం అలుముకుంది. జనరల్ ఆస్పత్రి మృతుల కుటుంబ సభ్యులు, బంధువులతో నిండిపోయింది.

కాంగ్రెస్‌తోనే కరువు వచ్చింది



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

కోదాడ: అబద్ధపు మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ప్రకృతికి కూడా ఇష్టం లేదని, కాంగ్రెస్‌తోనే కరువొచ్చిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగిన బీఆర్‌ఎస్ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు పంటలు పండుడేగాని ఎండుడు లేదని.. నేడు రాష్ట్రంలో ఎక్కడచూసినా పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలకు పెంపు, వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆయా వర్గాలను మోసం చేసిందన్నారు. పొద్దున లేస్తే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్దాలేనని ధ్వజమెత్తారు. జిల్లా నుంచి ఖమ్మం జిల్లాకు సాగర్ నీటిని తీసుకెళ్తుంటేమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నోరు వెళ్లబెట్టి చూస్తున్నాడని, ఆయనకు ఏది చేతకాదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య, నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, చింత కవిత, కందిబండ సత్యం, బెజవాడ శ్రావణ్, మేదర లలిత, పిట్టల భాగ్యమ్మ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



కోదాడ రూరల్ : నల్లబంగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

- కలెక్టర్ వెంకటరావు

కోదాడ రూరల్, మునగాల: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కోదాడ మండలం నల్లబండగూడెం, మునగాల మండలం బరాఖత్‌గూడెంలో ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నల్లబండగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని, ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి అక్రమంగా ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ డే సందర్భంగా కొమరబండ వై జంక్షన్‌లో మొక్కలకు నీరు పోశారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంతరాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అన్నారు. అక్రమంగా నగదు, మద్యం, ఇతర మాదాక ద్రవ్యాలు రావాణా కాకుండా నిఘా పెట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు రూ.25లక్షల నగదు, రూ.20లక్షల విలువైన వస్తువులను పట్టుకున్నట్లు చెక్‌పోస్ట్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. ఆ తర్వాత మునగాల శివారులో బాలాజీ రైస్ మిల్లును తనిఖీ చేశారు. సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, కోదాడ, మునగాల తహసీల్దారుల సాయగౌడ్, ఆంజనేయులు, ఎంపీడీఓలు రాంచందర్‌రావు, కె.రమేష్‌దీనదయాళ్, డీటీసీఎస్ రాంరెడ్డి, ఆర్‌ఐ రామారావు, బరాఖత్‌గూడెం కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీళ్లు రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఇమాంపేటలో నీటి శుద్ధి కేంద్రం మరమ్మతుల కారణంగా శని, ఆదివారం భగీరథ నీళ్లు సరఫరా కావని, తిరగి ఈనెల 15 సోమవారం ఉదయం నుంచి నీటి సరఫరా యాథావిధిగా జరగనుందని కలెక్టర్ ఎస్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాంట్ పరిధిలోని సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీలు అలాగే చిలుకూరు, కోదాడ, అనంతగిరి, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్, సూర్యాపేట మండలా పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిపివేశామని పేర్కొన్నారు. వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా జరుగుతుందని, నీటి ఇబ్బందులు ఉంటే కోదాడ టెక్నికల్ అధికారి రాజారెడ్డి నంబర్ 8374454641, సూర్యాపేట కంట్రోల్ రూమ్ : 83744 98499 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

పేట మార్కెట్‌కు భారీగా ధాన్యం



సూర్యాపేట మార్కెట్ యార్డుకు వచ్చిన వరి ధాన్యం

- ఒక్క రోజే 42,194 బస్తాల వడ్లు రాక
- మరో 355 బస్తాల పెసళ్లు, కందులు..
- అత్యధికంగా జైశ్రీరామ్ రకం ధాన్యం తీసుకొచ్చిన రైతులు
- శుక్రవారం సెలవు రద్దు చేయించిన కలెక్టర్

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరి ధాన్యం భారీగా అమ్మకానికి వస్తోంది. రంజాన్ కారణంగా యార్డుకు ఈనెల 11, 12వ తేదీల్లో రెండురోజుల పాటు సెలవును ప్రకటిస్తూ మార్కెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అయితే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరా ఈనెల 12వ తేదీన శుక్రవారం సెలవును రద్దు చేయించారు. దీంతో యార్డుకు పెద్ద మొత్తంలో రైతులు ధాన్యాన్ని తీసుకురాగా.. మార్కెట్ అధికారులు టోకెన్ విధానంలో లోపలికి అనుమతినిచ్చారు.

యార్డుకు 42,194 బస్తాలు రాక

పేట మార్కెట్‌కు శుక్రవారం 807మంది రైతులు 42,194 బస్తాలు (27,427 క్వింటాలు) ధాన్యాన్ని అమ్మకానికి తీసుకొచ్చారు. ఇందులో బీపీటీ 220 బస్తాలు, బీపీటీ (పాతవి) 32 బస్తాలు, ఐఆర్-64 రకం 7,144 బస్తాలు, హెచ్‌ఎంటీలు 6,658, హెచ్‌ఎంటీలు (పాతవి) 60 బస్తాలు వచ్చాయి. ఇక జైశ్రీరామ్‌రకం ధాన్యం అత్యధికంగా 28,080 బస్తాలు యార్డుకు తీసుకొచ్చారు. ఈ ధాన్యానికి మోడల్ ధర రూ.2,303 ఉండగా.. గరిష్ట ధర రూ.2,559, రూ.1,503 పడింది. అలాగే 40 బస్తాల కందులను తీసుకురాగా గరిష్టంగా రూ.11,034, కనిష్టంగా రూ.4,595 ధర పలికింది. 315 బస్తాల పెసళ్లు తీసుకురాగా క్వింటాకు గరిష్ట ధర రూ.8,239లు, కనిష్టంగా రూ.7,322 ధర పడింది.

ఉదయం 9 గంటలలోపే ధాన్యం తేవాలి

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిస్థితిని చూసి రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. యార్డుకు ఒకేసారి పెద్దమొత్తంలో ధాన్యాన్ని తీసుకు రావడంతో వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు చెత్తాచెదారం, తాలు, తేమ లేకుండా ప్రతిరోజు రాత్రి 12గంటల నుంచి ఉదయం 9గంటల వరకు కమీషన్‌దారుల సూచనల మేరకు యార్డుకు ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం 114 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అక్కడ కూడా ధాన్యాన్ని అమ్ముకునే అవకాశముందని తెలిపారు.

రాంప్రభుకు పూలే అవార్డు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు శుక్రవారం హైదరాబాద్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డు అందుకున్నారు. బీసీల అభ్యున్నతికి రాంప్రభు చేస్తున్న కృషికి ఈ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కమిటీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాంప్రభును సన్మానిస్తున్న నాయకులు

ప్రచారంలోకి కాంగ్రెస్

- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు నల్లగొండ పరిధిలో నిర్వహణ
- భువనగిరి పార్లమెంట్ పరిధిలో సమావేశాలు ప్రారంభం
- 21న భువనగిరి, 24న నల్లగొండ అభ్యర్థుల నామినేషన్
- ఆలోగా సమావేశాలు పూర్తి చేసేలా కార్యాచరణ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్‌పార్టీ ముమ్మరం చేసింది. శుక్రవారం భువనగిరి పార్లమెంట్ పరిధిలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించగా, శనివారం నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించనుంది. ఒక్కొక్కటిగా అన్ని నియోజకవర్గాల సమావేశాలను నిర్వహించేందుకు తేదీలను ప్రకటించి ముందుకు సాగుతోంది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో ఈనెల 22వ తేదీ వరకు మొదటి విడత సమావేశాలు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఇక 21వ తేదీన భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనుండగా, ఈ నెల 24వ తేదీన నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈలోగా లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు.

గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్

పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలను గెలిపించుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోంది. ఇందుకోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి, ప్రజల్లోకి వెళ్లి గెలుపొందేలా పావులు కదుపుతోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఎక్కువసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ చేతిలోనే ఉన్న రెండు స్థానాలను ఈ ఎన్నికల్లోనూ చేజిక్కించుకునే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాల్లో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, నేతలు, అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. శుక్రవారం జనగామలో జరిగిన సమావేశంలోనూ వారు పాల్గొన్నారు. ఇక నల్లగొండ పార్లమెంట్ పరిధిలో శనివారం నుంచి ప్రారంభం అయ్యే అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాల్లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

భువనగిరి పరిధిలో..

భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 21వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉంది. ఇక మొదటి అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం శుక్రవారం జనగామలో నిర్వహించింది. 13న ఆలేరు, 14న తుంగతుర్తి, 15న ఇబ్రహీంపట్నం, 16న భువనగిరి, 17న నకిరేకల్, 18న మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది.

నేటి నుంచి సమావేశాలు

నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో నిర్వహించే ఎన్నికల సన్నాహక సమావేశాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ పూర్తి చేసింది. షెడ్యూల్ ప్రకారం రోజూ సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశాలను నిర్వహించబోతోంది. 13వ తేదీన దేవరకొండ, 16న మిర్యాలగూడ, 18న కోదాడ, 19న హుజూర్‌నగర్, 20న సూర్యాపేట, 21న నల్లగొండ, 22న నాగార్జునసాగర్ నియోజక వర్గాల్లో సమావేశాలు నిర్వహించనుంది.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



చివ్వెంల : మొక్కకు నీరు పోస్తున్న ప్రియాంక

చివ్వెంల, మోతె: హరితహారం మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ కాలువ పక్కన ఉన్న సంపద వనాలు, వట్టిఖమ్మంపహాడ్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల పనులతోపాటు మోతె మండలం తుమ్మలపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల, మామిళ్లగూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. కార్యక్రమాల్లో మోతె తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ హరిసింగ్, చివ్వెంల ఎంపీఓ టి.గోపి, ఎంఈఓ గోపాల్‌రావు, ఏపీఓ నాగయ్య, ఏపీఎంలు రాంబాబు, వెంకయ్య, ఏఈలు యుగేంధర్, లింగయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు సరిత, రజియా, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త మృతి తట్టుకోలేక ఆత్మహత్య



నాగమణి మృతదేహం

కోదాడరూరల్: భర్త మృతిని తట్టుకోలేక మానసిక వేదనతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగమణి(20)కి 8 నెలల కిందట వివాహమైంది. ఆమె భర్త రామకృష్ణ రెండు నెలల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. భర్త మృతిని తట్టుకోలేని ఆమె మానసికంగా కుంగిపోయింది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన ఆమె సోదరి స్థానికుల సాయంతో కోదాడలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..



సుక్య (ఫైల్)

త్రిపురారం: మండల కేంద్రంలో ఓ వ్యక్తి కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రిపురారం ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు మర్ల చంద్రారెడ్డి వద్ద దామరచర్ల మండలంలోని వాచ్య తండాకు చెందిన లావురి సుక్య (62) గత 15 సంవత్సరాలుగా వ్యవసాయ పనులు చేసేందుకు జీతం ఉంటున్నాడు. అయితే సుక్య గత సంవత్సర కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గత రెండు రోజుల నుంచి కడుపు నొప్పి తీవ్రత పెరగడంతో గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో ఇంటి పైకప్పు కింద ఇనుప పైపుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లావురి సుక్య భార్య కాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధం

చివ్వెంల(సూర్యాపేట): ప్రమాదవశత్తు గ్యాస్ సిలిండర్ పేలి హోటల్ దగ్ధమైంది. ఈసంఘటన శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారి పక్కన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొండల రాయినిగూడెం గ్రామానికి చెందిన అంజి బీబీగూడెం గ్రామ శివారులో హోటల్ నిర్వహిస్తున్నాడు. సామగ్రి కోసం శుక్రవారం అతను సూర్యాపేటకు వెళ్లాడు. ఈక్రమంలో హోటల్‌లో సిలిండర్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు వచ్చి భారీ శబ్దంతో పేలింది. ఈ ప్రమాదంలో హోటల్‌లో పనిచేస్తున్న అంజి తల్లికి గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో హోటల్ ఫర్నిచర్, ఇతర సామగ్రి రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- కుటుంబ యజమానికి నోటి కేన్సర్
- ఆరు నెలలుగా మంచానికే పరిమితం
- చికిత్సకు రూ.10లక్షలు ఖర్చు
- ఆదుకోవాలని కుటుంబసభ్యుల వేడుకోలు



కన్నీటి గాధ

మునగాల(కోదాడ): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన కొరిపెల్లి వెంకన్న-స్వాతి దంపతులు. వీరిది రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం. గతేడాది వరకు వెంకన్న లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య స్వాతి దినసరి కూలీ. వీరికి ఇద్దరు సంతానం. సంవత్సరం క్రితం ఈ కుటుంబానికి ఊహించని షాక్ తగిలింది. వెంకన్న(30)కు సంవత్సరం క్రితం నోటి కేన్సర్ సోకింది. దీంతో తనకున్న ఎకరం భూమిని అమ్మి హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం పట్టణాల్లోని పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. భూమి అమ్మగా వచ్చిన రూ.6లక్షలకు మరో రూ.4లక్షలు అప్పు చేసి



మంచానికి పరిమితమైన వెంకన్నకు సపర్యలు చేస్తున్న భార్య

వైద్యం చేయించినప్పటికీ ఫలితం కనిపించలేదు. రూ.లక్ష వెచ్చించి కిమియోథెరపీ చేయించాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పడంతో రెండు, మూడు సార్లు కిమియోథెరపీ చేయించారు.

ఆర్థిక స్థోమత లేకపోవడంతో..

వెంకన్నకు నోటి కేన్సర్ తగ్గకపోగా రోజురోజుకు పెరుగుతుంది. ఇకపై వైద్యం చేయించే స్థోమత లేకపోవడంతో ఆరు నెలల నుంచి ఇంటి వద్దే మంచానికి పరిమితమయ్యాడు. భార్య కూలి పనికి వెళ్లకుండా భర్తకు సపర్యలు చేస్తోంది. దీంతో కుటుంబం గడవని పరిస్థితి ఏర్పడింది. దాతలు ముందుకు వచ్చి నిత్యావసర సరుకులు సమకూరిస్తేనే పూట గడుస్తుంది. వెంకన్న కుమారుడు, కు మార్తె స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వైద్య ఖర్చులకు దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.

సాయం చేయదలుకున్న వారు సంప్రదించాల్సిన నంబర్

కొరిపెల్లి వెంకన్న, ఆకుపాముల
ఎస్‌బీఐ బ్రాంచ్, ఆకుపాముల,
అకౌంట్ నంబర్ : 42250870714
ఫోన్ పే నంబర్ : 93460 05225

మా కుటుంబాన్ని ఆదుకోవాలి

నా భర్త అనారోగ్యం బారిన పడడంతో మా కుటుంబ పరిస్థితి తారుమారైంది. వైద్యచికిత్స కోసం ఉన్న కొద్ది భూమిని అమ్మడమే కాక దొరికిన చోట రూ.4లక్షలు అప్పు చేశాం. అయినప్పటికీ ఫలితం లేదు. ప్రస్తుతం కిమియోథెరపీ చేయిస్తే ఆరోగ్యం కుదుటపడే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కాని మా వద్ద చిల్లిగవ్వ కూడా లేదు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలి.

– స్వాతి, వెంకన్న భార్య, ఆకుపాముల

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతగిరి: మండల పరిధిలోని గోండ్రియాల శివారులోని పాలేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అనంతగిరి పోలీసులు పట్టుకున్నారు. అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మండల పరిధిలోని గోండ్రియాలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామం సమీపంలోని పాలేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగు ఇసుక ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్లు కొండబాల అజయ్‌రాజ్, నెల్లూరి నరేష్, నెల్లూరి బాలకోటయ్య, నెల్లూరి గోపిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని గోపాలపురం వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమ సిబ్బంది విధుల నిమిత్తం మండలంలోని గోపాలపురం వెళ్తుండగా డ్రైవర్ ఆవుల వీరయ్య ట్రాక్టర్‌లో నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

‘స్కిల్ డెవలప్‌మెంట్’ యువతకు గొప్పవరం



కోర్సు వివరాలు తెలుసుకుంటున్న చిన్నారెడ్డి

- రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

భూదాన్ పోచంపల్లి: రామానంద తీర్థ సంస్థను స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం యువతకు గొప్ప వరమని, త్వరలో 30లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం జాలాల్‌పురం గ్రామంలో గల రామానంద తీర్థ గ్రామీణ సంస్థను శుక్రవారం ఆయన సందర్శించారు. సంస్థ ప్రాంగణం కలియతిరిగి శిక్షణా కేంద్రాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు, వసతి గృహాలు పరిశీలించారు. అనంతరం సంస్థ డైరెక్టర్ లక్ష్మి, సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది ఉమ్మడి జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ నోడల్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నారని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కార్యాచరణ అమల్లోకి వస్తుందని ఆయన చెప్పారు.

గ్రంథాలయ మాజీ చైర్మన్ మృతి



నారపరెడ్డి (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుజ్జుల నారపరెడ్డి (80) హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామంలో శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నారపరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, హైదరాబాద్ అడిషనల్ ఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ధర్మూరి వెంకటేశ్వర్లు, గురవయ్య, రాము, పలువురు నాయకులు తదితరులున్నారు.

సంతాపం తెలిపిన మంత్రి

హుజూర్‌నగర్: ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుజ్జుల నారపరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారపు రెడ్డి మరణం అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి తన సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. నారపరెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



నల్లగొండ జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్ : బీసీ కులాల గణన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో అణిచివేతకు గురవుతున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలకు వెళ్తామని చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. బీసీ కులగణన చేయకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా కులగణనకు తీర్మానం చేసిన ప్రభుత్వం.. అందుకు సంబంధించిన జీవోను సైతం విడుదల చేయడమేగాక బడ్జెట్ కేటాయించి ఇప్పుడు మాట తప్పుతుందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాల్లో 3 సీట్లు మాత్రమే బీసీలకు కేటాయించిందన్నారు. త్వరలో ప్రకటించనున్న 3 స్థానాల్లో బీసీకు అవకాశం కల్పించి సముచిత న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరిరామరాజు, ప్రధాన కార్యదర్శి నేల పట్ల సత్యనారాయణ, కేశబోయిన శంకర్, శ్రీనివాస్, జాజుల లింగంగౌడ్, మధుయాదవ్, దుగ్యాల భజరంగ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ప్రజ్ఞాశీలిని కోల్పోవడం బాధాకరం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- మిర్యాలగూడలో దాసి సుదర్శన్ సంస్మరణ సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: చిత్రకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఉత్తమ ఉపాధ్యాయుడు, నటుడు దాసి సుదర్శన్‌ను కోల్పోవడం బాధాకరమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని వాసవి భవనంలో సమూహ రైటర్స్ ఫోరం నేత కస్తూరి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన దాసి సుదర్శన్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాసి సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరించి జాతీయ స్థాయిలో అవార్డు సాధించి మిర్యాలగూడకు పేరు తేవడం గర్వంగా ఉందన్నారు. సుదర్శన్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. దాసి, కోమరంభీం ఫేం, ప్రముఖ నటుడు భూపాల్, విరాటపర్వం ఫేం, సినీ దర్శకుడు బుడుగుల వేణు మాట్లాడుతూ దాసి సుదర్శన్ ఆ రోజుల్లోనే జాతీయ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. ఎప్పుడు చిరునవ్వుతో కలివిడిగా ఉండే సుదర్శన్ ఆకాల మృతి తీరని లోటన్నారు. దక్షిణ భారతదేశంలో జాతీయ స్థాయిలో అవార్డును అందుకున్న ఏకైక వ్యక్తి దాసి సుదర్శన్ అని పేర్కొన్నారు. సాక్షి కార్టూనిస్టు శంకర్ మాట్లాడుతూ సుదర్శన్ వేసిన చిత్రాలను హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు దాసి సుదర్శన్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సీడీ రవికుమార్, తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, కార్టూనిస్టులు చిత్ర, నర్సింహ, నాగార్జునసాగర్ బీఈడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రసాద్, సుదర్శన్ సతీమణి స్వతంత్ర, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ఇనుగుర్తి విజయ్‌కుమార్, ఉదయ, కిరణ్మాయి, కూర్వేళ్ల శ్రీనివాస్, వడ్డేపల్లి వెంకటేష్, తిరుమలరావు, కందుకూరి సుదర్శన్, బీసం రామయ్య, కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు ముప్వ రామారావు, జాడీ రాజు, ఎంఎస్ రెడ్డి, యాదయ్య, జ్వాల వెంకటేశ్వర్లు, గణేష్, కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మీటర్ రీడింగ్ మిషన్ లైన్‌మన్ కొనుక్కోవాలట!

- ఒక్కో మిషన్ ఖరీదు రూ.15వేలు
- వీటిని కొనుగోలు చేయలేక.. అధికారులకు సమాధానం చెప్పలేక అయోమయస్థితి
- కొత్తవాటితోనే బిల్లు తీయాలని నిబంధన



విద్యుత్ మీటర్ రీడింగ్ బిల్లులను తీసే కొత్త యంత్రాలు

కోదాడ: విద్యుత్ మీటర్ల రీడింగ్‌ను ఈ నెల నుంచి సెల్‌ఫోన్‌తో అనుసంధానం చేసే కొత్త (అన్‌లాగ్ డాంగిల్) మిషన్ ద్వారా తీయాలని చెబుతున్న అధికారులు వాటిని సరఫరా చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వేల రూపాయల ఖరీదు చేసే ఈ మిషన్లను లైన్‌మన్లు తమ సొంత డబ్బులతో కొనుగోలు చేసుకోవాలని, వాటి ద్వారా మాత్రమే మీటర్ రీడింగ్ తీయాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ లైన్‌మన్లు మాత్రం వీటిని కొనుగోలు చేయలేక, ఉన్నతాధికారులకు ఏం సమాధానం చెప్పాలో అర్థంగాక ఇబ్బంది పడుతున్నారు. గతంలో విద్యుత్‌శాఖ అధికారులు ట్విమ్ మిషన్ ద్వారా మీటర్ల రీడింగ్ తీసేవారు. కానీ ఈ ఏప్రిల్ నెల నుంచి సెల్‌ఫోన్‌తో అను సంధానమైన స్కానింగ్‌మిషన్, ప్రింటర్ల (అన్‌లాగ్ డాంగిల్ మిషన్) ద్వారా మీటర్ రీడింగ్ తీయాలని నిర్ణయించారు. హుజూర్‌నగర్ సబ్ డివిజన్‌లో ఉన్న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో దాదాపు వెయ్యి మిషన్‌లు అవసరమవుతాయని సమాచారం. కానీ అధికారులు మాత్రం కేవలం 20 మిషన్‌లను మాత్రమే అందించారు. వీటిని కూడా తమకు అనుకూలమైన వారికి మాత్రమే ఇచ్చి మిగతావారిని సొంత డబ్బులతో కొనుగోలు చేసుకోవాలని ఆదేశించారని తెలిసింది. ఒక్కో మిషన్, సెల్‌ఫోన్ కలిపి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికి దాదాపు రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని పలువురు లైన్‌మన్లు చెబుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని కొనుగోలు చేసి వాటి ద్వారా మాత్రమే రీడింగ్ తీయాలని ఎట్టి పరిస్థితుల్లో పాత మిషన్‌ల ద్వారా తీయవద్దని చెబుతున్న అధికారులు వాటిని ప్రభుత్వమే సరఫరా చేసే విధంగా చూడాలని కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆలోచించాలని వారు అంటున్నారు.

మద్యం పట్టివేత

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో బెల్ట్‌షాప్‌పై శుక్రవారం పోలీసులు దాడి చేసి మద్యంను పట్టుకున్నారు. సత్యనారాయణ, పిచ్చమ్మ మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఏఎస్ఐ బలరాంరెడ్డితో కలిసి దాడి చేశారు. రూ. 10 వేల విలువ గల మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

గుండాల : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని పిల్లల తల్లిదండ్రులు ఈనెల 8న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేశారు. నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి 9వ తేదీన రిమాండ్ చేశారు. డీఈఓ ఉత్తర్వుల మేరకు హెచ్ఎంను సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ఆధ్యాత్మికత పెంచేలా..



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక చింతన కలిగేలా ఏర్పాట్లు చేశారు. కొండపైన తూర్పు మాఢ వీధిలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కోదండపాణి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో భక్తి సంగీతం, సాయిని నృత్యాలయం కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

దివ్యాంగులకు ఉచిత దర్శనం కల్పించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్

భువనగిరి : స్వర్ణగిరి దేవాలయంలో దివ్యాంగులకు ఉచిత, ప్రత్యేక దర్శనం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ కోరారు. శుక్రవారం వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేవాలయాన్ని సందర్శించి అనంతరం వారు మాట్లాడారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేశారని, అయితే ఆలయంలోపలికి వెళ్లేందుకు ర్యాంప్ సౌకర్యం లేకపోవడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా కోశాధికారి బొల్లేపల్లి స్వామి ,జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత, నాయకులు మురళీనాయక్ ఉన్నారు.

అనువైన కూరగాయ పంటలు ఎంచుకోవాలి

- వేసవిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై హార్టికల్చర్ కన్సల్టెంట్ సూచనలు



సుందరి సురేష్, హార్టికల్చర్ కన్సల్టెంట్

నడిగూడెం: వేసవిలో సాగు చేసేందుకు అనువైన కూరగాయలను ఎన్నుకోవాలని, ఎప్పటికప్పుడు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ పేర్కొంటున్నారు. యాజమాన్య పద్ధతులతో వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రత, వాతావరణంలో ఉండే తక్కువ తేమను అధిగమించి అధిక లాభాలు పొందవచ్చని చెబుతున్నారు. వేసవిలో కూరగాయల సాగులో పాటించాల్సిన మెలకువలు ఆయన వివరించారు.

సాగు విధానం..

- కొత్తగా నాటిన మామిడి, జామ, కొబ్బరి లాంటి పండ్ల తోటల్లో మొదటి 3–4 సంవత్సరాలు అంతరపంటగా బెండ, సొర, బీర, గుమ్మడి, దోస, ఫ్రెంచి చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయ పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చు.
- నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు, వాటితో పాటు జీవన ఎరువులను వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల నేల గుల్లబారి, తేమను ఎక్కువ రోజులు పట్టివుంచి మొక్కకు అందుబాటులో ఉండేటట్లు చేస్తుంది.



సాగులో ఉన్న బీర తోట

- ఉన్న కొద్దిపాటి నీరు బిందు, తుంపర్ల పద్ధతిలో ఇవ్వడంతో కొద్ది నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయ పంటలను పండించవచ్చు.



పాడి పంట

- ఒక ఎకరానికి సరిపడ నీటితో డ్రిప్ ద్వారా 2.50 ఎకరాల్లో, తుంపర్ల పద్ధతిలో ఎకరంన్నర నుంచి రెండు ఎకరాల్లో సాగు చేసుకోవచ్చు. అంతే కాకుండా నీరు సక్రమంగా ఇవ్వడం వల్ల తుంపర్ల ద్వారా ఎండ వేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు. సాధారణ పద్ధతిలో నీరు ఇచ్చే పంటల్లో ఎండ తీవ్రత తగ్గించడానికి అప్పుడప్పుడు సాయంత్రం వేళలో నీటిని పిచికారీ చేయాలి.
- యూరియా ఎండ వేడికి త్వరగా ఆవిరి కాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండేలా 9 కిలోల యూరియాను ఒక కిలో వేపపిండిలో కలిపి వేయాలి. లేదా ప్రతి 25 కిలోల యూరియాకు కిలో వేపనూనె కలిపి అరగంట సేపు ఆరబెట్టి పంటలకు వేయాలి.
- పూత, పిందె రాలకుండా పిందె బాగా పట్టడానికి టమాట, వంగ లాంటి పంటకు ఒక మి.లీ. ప్లానోఫిక్స్ 4.5 లీటర్ల నీటిలో కలిపి పూత దశలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- కూరగాయలను, ఆకుకూరలను చల్లటి పూట కోసి, తడిగోనె సంచి కప్పి మార్కెట్‌కు పంపాలి.
- వేసవిలో నారును నీడలోనే పెంచాలి. రసం పీల్చే పురుగుల నివారణకు తప్పనిసరిగా ఇమిడిక్లోప్రిడ్ (5 గ్రాములు కిలో విత్తనానికి) విత్తనశుద్ధి చేయాలి. నారుమళ్లపై నైలాన్ వల ఏర్పాటు చేసుకుంటే రసం పీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ల సమస్యను అధిగమించవచ్చు.
- పొలంలో మొక్కలకు నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్న లాంటి పంటలను ఉత్తర దక్షిణ దిశలో నాటుకోవాలి. లేదా వీలైన రైతులు 35 శాతం షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేసుకుంటే ఎండ తీవ్రతను తగ్గించి మంచి దిగుబడులు పొందవచ్చు.

- ఆకుకూరల పంటల్లో ఆకు దిగుబడి పెంచడానికి 2 శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి), 50 పిపియం జిబ్బరిల్లిక్ ఆమ్లం (50 మిల్లీగ్రాములు లీటరు నీటికి) ద్రావణాన్ని పంటలపై పిచికారీ చేయాలి.
- పొటాష్‌ను సరైన మోతాదులో వాడితే నీటి ఎద్దడి, చీడపీడలను తట్టుకునే గుణం మొక్కల్లో ఎక్కువగా ఉంటుంది. ప్రతి కిలో యూరియాకు అర కిలో పొటాష్‌ను తప్పనిసరిగా వాడాలి.
- టమాట, పుచ్చలో నీటియాజమాన్యం సరిగ్గా లేకపోతే కాయ పగుళ్లు కనబడతాయి. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండేటట్లు చూడాలి. కాయ పగుళ్ల నివారణకు బోరాక్స్ లేదా ఆల్‌బోర్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- తీగ జాతి కూరగాయల్లో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు పూతదశలో సైకోసిల్ 2.5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా గింజ విత్తిన 15 రోజులకు 2- 4 ఆకుల దశలోనే 3-4 గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.